

కూచిపూడి నృత్యార్చన

మాదాపూర్: మాదాపూర్‌లోని అన్నమయ్యపురంలో అన్నమయ్య స్వరార్చన కార్యక్రమంలో భాగంగా శనివారం మానస నృత్య శిక్షణాలయం విద్యార్థులు కూచిపూడి నృత్యంతో ఆకట్టుకున్నారు. ఇందులో వినాయక కౌతం, మూషికవాహన, ముద్దుగారే యశోద, ఇదిగో భద్రాద్రి, తారంగం, అంబపలుకు, మీనాక్షి పంచరత్న తదితర అంశాలను కళాకారులు శ్రీవిద్య, సహస్ర, శ్రీమయి, శాన్వి, మహిశ్రీ, సమన్విత, సిరిచందన, రిషిక సాయి, చైత్రశ్రీ, ప్రదీక్ష, గగన దీక్షిత తదితరులు ప్రదర్శించారు. పద్మశ్రీ డాక్టర్ శోభరాజు కళాకారులను సత్కరించారు.

శిల్పారామంలో పోహెలా బోయిషాక్





మాదాపూర్: శిల్పారామంలో ఉత్తరాన్ బంగియా సమితి, శిల్పారామం సంయుక్త నిర్వహణలో బెంగాలీ నూతన సంవత్సరమైన పోహెలా బోయిషాక్ వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. బెంగాలీ సాంప్రదాయ దుస్తులతో అలరించారు. స్టాల్స్‌లో చీరలు, జువెలరీ, పెయింటింగ్స్ తదితర ఉత్పత్తులు నగరవాసులను విశేషంగా ఆకట్టుకున్నాయి. రవీంద్రనాథ్ ఠాగూర్ సాహిత్యంపై సంగీతం, నృత్యాలు ఆకట్టుకన్నాయి. రోల్, షోండేష్, బెంగాలీ స్ట్రీట్‌ఫుడ్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. నగరంలోని బెంగాలీ కుటుంబాలు పాల్గొని ఉత్సాహంగా గడిపారు.

కాంగ్రెస్ గెలుపునకు కృషి చేయాలి

పటాన్‌చెరు టౌన్: కాంగ్రెస్ గెలుపునకు ప్రతి కార్యకర్త కృషి చేయాలని మెదక్ ఎంపీ అభ్యర్థి నీలం మధు అన్నారు. శనివారం చిట్కుల్ గ్రామంలో నీలం మధు కార్యాలయంలో మెదక్ పార్లమెంటు పరిధిలోని కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ,ప్రజా సంఘాల, స్వచ్ఛంద సంస్థలు తమ మద్దతు ప్రకటిస్తూ,నీలం మధును కలిసి సన్మానించారు.ఎంపీ ఎన్నికలలో గెలిపించేందుకు తమ వంతుగా పాటుపడతామని చెప్పారు.

అసంపూర్తి పనులు.. అల్లుకుంటున్న

గుర్రపుడెక్క

- గురునాథం చెరువులో నగంలోనే ఆపేసిన పనులు
- మళ్లీ విస్తరిస్తున్న వైనం.. పట్టించుకోని అధికారులు

మియాపూర్: గురునాథం చెరువులో గుర్రపు డెక్క తొలగింపు పనులు అసంపూర్తిగా చేసి వదిలేయడంతో తిరిగి అల్లుకుంటోంది. చెరువుల్లో గుర్రపుడెక్క తొలగింపుపై అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. గుర్రపు డెక్క తొలగించేందుకు లక్షల రూపాయలు నిధులు వెచ్చిస్తున్నా పర్యవేక్షణ లేకపోవడంతో కాంట్రాక్టర్లు అసంపూర్తి పనులతో సరిపెడుతున్నారని స్థానికులు వాపోతున్నారు. పైగా చెరువుకట్టలపై వేసిన గుర్రపుడెక్కను అక్కడ నుండి తొలగించకపోవడంతో అది మళ్లీ విస్తరిస్తోంది.

- మియాపూర్ గురునాథం చెరువులో గుర్రపుడెక్క ఏపుగా పెరిగిపోయింది. దీనిని తొలగించడంలో సంబంధిత అధికారుల నిర్లక్ష్యం కారణంగా ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.
- రెండు నెలల నుంచి గుర్రపు డెక్కను యంత్రాల సహాయంతో తొలగించి తరువాత వదిలేశారు. చెరువులో కొంతభాగం తొలగించిన గుర్రపు డెక్కను చెరువు కట్టపై వేశారు. దీనిని అక్కడ నుంచి తొలగించకపోవడంతో తిరిగి చెరువులోకి చేరుతోంది.
- చుట్టు పక్కల కాలనీల నుండి వస్తున్న మురుగు నీరు చెరువులో చేరి దుర్వాసన వెదజల్లుతోంది. దోమలు ప్రబలుతున్నాయని స్థానికులు వాపోతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి గుర్రపు డెక్కను పూర్తిగా తొలగించడంతో బాటు చెరువును శుద్ధి చేయాలని స్థానికులు కోరుతున్నారు.



మియాపూర్ గురునాథం చెరువులో సగం మేర తొలగించిన గుర్రపు డెక్క



నాలాలు కబ్జా..

మయూరీనగర్, నడిగడ్డతండా, న్యూ కాలనీల పరిసర ప్రాంతాల నుండి వచ్చే వరదనీరు గురునాథం చెరువులో చేరుతోంది. చెరువుల్లో వరదనీరు చేరడానికి అందులో నుంచి కింది చెరువుకు వెళ్లేందుకు నాలా లేకపోవడంతో ఆ ప్రాంత ప్రజలు వరద ముంపునకు గురవుతున్నారు. నాలాల ఆక్రమణ, నాలాలపై భవన నిర్మాణాలు జరగడం కాలనీల ముంపునకు ప్రధాన కారణం. గురునాథం చెరువు విస్తీర్ణం, చెరువుపై భాగంలో, కింది భాగంలో ఉన్న నాలాల పరిధి, విస్తరణను అధికారులు పట్టించుకోకపోవడంతో ఆక్రమణలకు గుర్రై కుంచించుకుపోయింది. అధికారులు స్పందించాలని ప్రజలు కోరుతున్నారు.



ఇనార్బిట్‌మాల్‌లో రేరిజం స్టోర్‌ను ప్రారంభించిన సినీనటి శ్రీలీల



మాదాపూర్: మహిళల ఫ్యాషన్ బ్రాండ్ అయిన రేరిజం మూడవ అవుట్‌లెట్‌ను మాదాపూర్‌లోని ఇనార్బిట్‌మాల్‌లో శనివారం సినీనటి శ్రీలీల ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ యువతను ఆకట్టుకునే విధంగా ప్రత్యేక డిజైన్‌లను అందిస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో రేరిజం బిజినెస్ హెడ్ అభిషేక్ శ్రీవాస్తవ తదితరులు పాల్గొన్నారు.

బాబాయి హోటల్ ప్రారంభం

పాల్గొన్న టాలీవుడ్ నటుడు కిరణ్ అబ్బవరం



మాదాపూర్‌లో బాబాయి హోటల్‌ని ప్రారంభించిన నటుడు కిరణ్

మాదాపూర్: మాదాపూర్‌లో బాబాయి హోటల్‌ని టాలీవుడ్ నటుడు కిరణ్ అబ్బవరం, నిర్వాహకులు కేవీ దినేష్‌రెడ్డి, శ్రేష్టరెడ్డిలు శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రుచికరమైన, పోషకాహారానికి కేరాఫ్‌గా బాబాయి హోటల్ అందుబాటులో ఉందని తెలిపారు. గత 8 దశాబ్దాలుగా బాబాయి హోటల్ రుచికరమైన వంటలను అందిస్తుందని తెలిపారు. దోస, ఇడ్లీ, ఉప్మాలతో పాటు మరిన్నీ స్పెషల్ టిఫిన్స్ అందుబాటులో ఉన్నాయన్నారు.

గంజాయి విక్రేత అరెస్ట్

250 గ్రాముల గంజాయి స్వాధీనం



గంజాయి ప్యాకెట్లతో బసవ రాజప్ప

గచ్చిబౌలి: గుట్టుచప్పుడు కాకుండా గంజాయి విక్రయిస్తున్న వ్యక్తిని గచ్చిబౌలి పోలీసులు అరెస్ట్ చేశారు. సీఐ ఆంజనేయులు తెలిపిన ప్రకారం వివరాలు.. సవదత్తి బసవ రాజప్ప(38) డ్రైవర్. గచ్చిబౌలి ఏపీ హెచ్‌బీ కాలనీలో నివాసం ఉంటూ కొంత కాలంగా గంజాయి విక్రయిస్తున్నాడు. దూల్‌పేట్ నుంచి గంజాయి కొనుగోలు చేసి వలస కూలీలు, ఐటీ ఉద్యోగులకు విక్రయిస్తున్నట్లు సమాచారం అందడంతో మాదాపూర్ ఎస్‌ఓటీ పోలీసులు రాజప్పను అదుపులోకి తీసుకున్నారు. 250 గ్రాముల గంజాయి ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు గచ్చిబౌలి పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

తప్పిపోయిన బాలుడి అప్పగింత



రాజశేఖర్‌ను అభినందిస్తున్న డీసీపీ డా.వినీత్

మాదాపూర్: ఆడుకుంటూ ఇంటి వద్ద నుంచి తప్పిపోయిన బాలుడిని గంట వ్యవధిలో తల్లిదండ్రులకు అప్పగించిన సంఘటన మాదాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో శనివారం చోటుచేసుకుంది. మాదాపూర్ ఇన్‌స్పెక్టర్ గడ్డం మల్లేష్ తెలిపిన వివరాల ప్రకారం.. శనివారం మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో బాలుడు జె.హరీష్‌వా (3) కొండాపూర్‌లో ఇంటి నుంచి తప్పిపోయాడు. కొండాపూర్‌లోని వైట్‌ఫీల్డ్ రోడ్డులో అయోమయంగా తిరుగుతుండగా అదే సమయంలో అటువైపు వెలుతున్న రాజశేఖర్ అనే వ్యక్తి బాలుడిని గమనించి వివరాలు అడుగగా ఇంటికి వెళ్లాలని ఏడ్వడంతో మాదాపూర్ డీసీపీ ఆఫీసుకు తీసుకువెళ్ళి అప్పగించారు. తల్లిదండ్రుల వివరాలను సేకరించి గంట వ్యవధిలో బాబుని అప్పగించారు. మాదాపూర్ డీసీపీ డాక్టర్ జి.వినీత్ అతనిని అభినందించారు.

కూరగాయల ధరలు

శేరిలింగంపల్లి: నల్లగండ్ల మార్కెట్‌లో .. టమాట 25, పచ్చిమిర్చి 70, బెండ 50, కాకర 50, దొండ 40, దోస 30, ఆలు 40, చామ 60, కీర 30, బీర 50, వంకాయ 30, గోకర 50, బీన్స్ 70, బీట్‌రూట్ 40, క్యాప్సికమ్ 70, క్యాబేజీ 40, క్యారెట్ 40, చిక్కుడు 70, ఉల్లి 25(కేజీ), ములక్కాయలు (2)10, క్యాలీఫ్లవర్ (1) 30, సొరకాయ (కేజీ) 20, అల్లం 150, వెల్లుల్లి 250.

నల్లగండ్ల హుడా కాలనీ అభివృద్ధికి కృషి

కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి



కాలనీవాసులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి

శేరిలింగంపల్లి: కాలనీల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని గచ్చిబౌలి డివిజన్ కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి తెలిపారు. నల్లగండ్ల హుడా కాలనీలో శనివారం నిర్వహించిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కాలనీ పార్కులో ఓపెన్‌జిమ్‌తో పాటు చిల్డ్రన్స్ పార్కు, క్రీడా ప్రాంగణం, మల్టీపర్పస్ ఫంక్షన్ హాల్, భూగర్భ డ్రైనేజీ, సీసీ రోడ్లు, స్ట్రీట్ లైట్ల సమస్యలను కాలనీవాసులు ఆయన దృష్టికి తీసుకువచ్చారు. ఆయన మాట్లాడుతూ హుడా కాలనీ అభివృద్ధికి చర్యలు తీసుకుంటానన్నారు. కార్యక్రమంలో కాలనీ అసోసియేషన్ నాయకులు రంజిత్‌పూరి, భరత్, సుందర్ లాల్, కృష్ణమూర్తి, దొరబాబు పాల్గొన్నారు.

ఇంటింటి ప్రచారం

హఫీజ్‌పేట్: పార్లమెంట్ ఎన్నికలో హస్తం గుర్తుకు ఓటు వేసి కాంగ్రెస్ పార్టీని గెలిపించాలంటూ హఫీజ్‌పేట్ డివిజన్ పరిధిలోని గంగారం గ్రామం, సుభాష్‌నగర్, ఇంజనీర్స్ ఎన్‌క్లేవ్‌లలో శనివారం ఇంటింటి ప్రచారం చేశారు. చేవెళ్ల ఎంపీ అభ్యర్థి డాక్టర్ రంజిత్‌రెడ్డి తనయుడు జి.రాజ్ ఆర్యన్‌రెడ్డి, కుటుంబ సభ్యులు, శేరిలింగంపల్లి అబ్జార్వర్, టూరిజం డెవలప్‌మెంట్ చైర్మన్ పటేల్ రమేష్‌రెడ్డి, ఎంబీసీ అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ జేరిపేటి జైపాల్, నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి జగదీశ్వర్‌గౌడ్, కార్పొరేటర్ పూజిత గౌడ్‌లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో అభివృద్ధే ప్రధాన ఎజెండాగా ముందుకు సాగుతున్నామన్నారు.

ఉచిత వైద్య శిబిరం

మోతీనగర్: ఉచిత వైద్య శిబిరాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని తులసీనగర్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు సామ కొండల్ రెడ్డి పేర్కొన్నారు. శనివారం అల్లాపూర్ డివిజన్ తులసీనగర్ కమిటీ హాలులో తులసీనగర్ సంక్షేమ సంఘం, శ్రావణి హాస్పిటల్ సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో యూరాలజీ, గైనకాలజీ సంబంధిత సమస్యలతో పాటు రక్తపోటు, మధుమేహం, సాధారణ వైద్య పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి మందులను ఉచితంగా అందజేశారు.

స్పోర్ట్స్ షాపులో అగ్ని ప్రమాదం

రూ.20 లక్షల ఆస్తి నష్టం



గచ్చిబౌలి: స్పోర్ట్స్ షాపులో జరిగిన అగ్ని ప్రమాదంలో రూ.20 లక్షల ఆస్తి నష్టం జరిగిందని మాదాపూర్ ఫైర్ ఆఫీసర్ ఫైజల్ తెలిపారు. కొత్తగూడ ప్రశాంత్‌నగర్‌లోని ప్రధాన రహదారిలో ఉన్న పవర్ మ్యాక్స్ ఫిట్‌నెస్ సెంటర్‌లో శనివారం మధ్యాహ్నం 12 గంటలకు అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. షాపు మూసి వేసి ఉండటంతో షట్టర్ లోపలి నుంచి దట్టమైన పొగ రావడం గమనించిన ప్రజలు అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించారు. అగ్నిమాపక సిబ్బంది షట్టర్‌లను తెరచి మంటలు ఆర్పారు. షార్ట్ సర్క్యూట్ కారణంగానే ప్రమాదం చోటు చేసుకుందని ఆట వస్తువులు కాలిపోయాయని అధికారులు తెలిపారు.

మహిళా మోర్చాను పటిష్ఠం చేయాలి



కొత్తపల్లి పద్మను సన్మానించిన కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి

రాయదుర్గం: బీజేపీ మహిళామోర్చా కో కన్వీనర్ కొత్తపల్లి పద్మ శనివారం గచ్చిబౌలి కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డిని కలిశారు. గోపన్‌పల్లిలోని కార్పొరేటర్ కార్యాలయంలో ఆమె గంగాధర్‌రెడ్డిని కలువగా పద్మను శాలువాతో సత్కరించారు. చేవెళ్ల పార్లమెంటు నియోజకవర్గంస్థాయిలోనూ మహిళా మోర్చాను పటిష్ఠం చేయాలని సూచించారు. ఈ పార్లమెంటు ఎన్నికలలో మహిళలంతా బీజేపీకి ఓటు వేసేలా మహిళా మోర్చా కష్టపడి పనిచేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా రూరల్ మహిళా మోర్చా ప్రధాన కార్యదర్శి మైత్రీ సాల్మన్, గచ్చిబౌలి మహిళా మోర్చా అధ్యక్షురాలు చిలుకూరి మహేశ్వరి, బీజేపీ నాయకులు తిరుపతి, సుజాత, పార్వతి పాల్గొన్నారు.

కిక్ బాక్సింగ్ క్రీడాకారిణికి చేయూత



క్రీడాకారిణికి చెక్కును అందజేస్తున్న కార్పొరేటర్ నాగేందర్ యాదవ్, విజయ్

హఫీజ్‌పేట్: జాతీయ కిక్ బాక్సింగ్‌లో రాణిస్తున్న భెల్ ప్రాంతానికి చెందిన క్రీడాకారిణి కీర్తన శ్రీవల్లికి హోప్ ఫౌండేషన్ చేయూతనందించింది. శనివారం చందానగర్ హోప్ ఫౌండేషన్ కార్యాలయంలో శేరిలింగంపల్లి డివిజన్ కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్ క్రీడాకారిణికి రూ.30వేల చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మేలో అంతర్జాతీయ వేదికగా టర్కీలో జరగనున్న అంతర్జాతీయ కిక్ బాక్సింగ్ పోటీలలో శ్రీవల్లి పాల్గొననుందన్నారు. ఫౌండేషన్ చైర్మన్ కొండ విజయ్‌కుమార్, మాజీ కౌన్సిలర్ వీరేశం గౌడ్, రవీంద్ర ప్రసాద్ దూబే, మహేష్ గౌడ్ పాల్గొన్నారు.

క్రీడా గాయాలు.. ఆర్థోస్కోపి లైవ్ సర్జరీ సదస్సు



మాట్లాడుతున్న ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ కే రఘువీర్

మాదాపూర్: మోకాలి కీలు సంరక్షణలో నాన్ సర్జికల్, సర్జికల్ విధానాలు ఉన్నాయని ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ కే రఘువీర్ తెలిపారు. మాదాపూర్‌లోని హెచ్‌ఐసీసీలో శనివారం స్పోర్ట్స్ ఇంజ్యూరి, ఆర్థోస్కోపి లైవ్ సర్జరీ-2024 సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండు రోజుల పాటు నిర్వహించనున్న ఈ సదస్సులో మోకాలి శస్త్రచికిత్సలో అధునాతన పద్ధతులను తెలుసుకోవచ్చన్నారు. ఈ సదస్సులో దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి 400 మందికి పైగా సర్జన్లు పాల్గొన్నట్టు తెలిపారు. మోకాలి కీలులో దెబ్బతిన్న భాగాలను తొలగించి, వాటి స్థానంలో కృత్రిమ భాగాలను ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. దెబ్బతిన్న మోకాలి కీలు మార్పిడి అవసరం లేకుండానే మోకాళ్ళ నొప్పులు తగ్గించవచ్చన్నారు. మోకాలి ఆస్టియోటమీ తర్వాత కోలుకోవడానికి సాధారణంగా 6 నుంచి 12 వారాల సమయం పడుతుందన్నారు. కార్యక్రమంలో డాక్టర్ అడ్రియన్ విల్సన్, , డాక్టర్ క్రిస్టియన్‌లోగ్లెలతో పాటు 20 మంది ప్రముఖ సర్జన్లు పాల్గొన్నారు.

చలో చేవెళ్లకు బీఆర్ఎస్ నాయకులు



గచ్చిబౌలి/రాయదుర్గం: 'చలో చేవెళ్ల' కార్యక్రమానికి శేరిలింగంపల్లి నియోజకవర్గం నుంచి బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు తరలారు. శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడిగాంధీ, కార్పొరేటర్లు రాగం నాగేందర్‌యాదవ్, హమీద్‌పటేల్, శ్రీనివాసరావు, సత్యనారాయణ, ఉప్పలపాటిశ్రీకాంత్, మంజులా రఘునాథ్‌రెడ్డి, రోజాదేవి, మాజీ కార్పొరేటర్ సాయిబాబా తదితరులు వెళ్లారు.

తరలిన భెల్ ఎంఐజీ కాలనీ వాసులు..

శేరిలింగంపల్లి: బీఆర్ఎస్ పార్టీ తలపెట్టిన చలో చేవెళ్ల బహిరంగ సభకు శేరిలింగంపల్లి భెల్ ఎంఐజీ కాలనీ నుంచి పార్టీ శ్రేణులు శనివారం భారీగా తరలి వెళ్ళారు. ఎంఐజీ కాలనీలోని పోచమ్మ ఆలయం వద్ద పార్టీ నాయకులు ఆదర్శ్‌రెడ్డి, మాజీ కౌన్సిలర్లు మోహన్‌గౌడ్, రవీందర్‌రావు, నాగమణిలు జెండా ఊపి వాహనాలను ప్రారంభించారు.

'కొండా'కు మద్దతుగా ప్రచారం

భాగ్యనగర్‌కాలనీ: చేవెళ్ల బీజేపీ ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి గెలుపుకోసం హైదర్‌నగర్ డివిజన్‌లో బీజేపీ యువ నాయకుడు వీరు యాదవ్ శనివారం బీజేపీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ఇంటింటి ప్రచారం చేశారు. నిత్యం ప్రజల మధ్య ఉంటూ అనేక సేవా కార్యక్రమాలు చేపడుతున్న విశ్వేశ్వర్‌రెడ్డిని అఖండ మెజార్టీతో గెలిపించాలని ఇంటింటికి కరపత్రాలను అందించి కోరారు. ఈ సందర్భంగా వీరు యాదవ్ మాట్లాడుతూ కేంద్రంలో భారత ప్రధానిగా మోడీ బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి దేశం రూపురేఖలు మారిపోయాయని తెలిపారు. రామమందిర నిర్మాణం మోడీ సారథ్యంలో సాకారం కావటం ఆనందంగా ఉందన్నారు. చేవెళ్ల పార్లమెంట్‌లో ఈసారి ప్రజలు బీజేపీ ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి వైపు చూస్తున్నారని, కాంగ్రెస్, బీఆర్‌యస్ పార్టీల మోసపూరిత హామీలను నమ్మే పరిస్థితిలో ప్రజలు లేరని కేంద్రంలో మరోసారి మోదీ ప్రభుత్వం ఖాయమని, ఈసారి చేవెళ్ల పార్లమెంట్ స్థానం బీజేపీ కైవసం చేసుకుంటుందన్నారు.

ఆన్‌లైన్ క్రికెట్ బెట్టింగ్ ముఠా అరెస్ట్

గచ్చిబౌలి: కొండాపూర్‌లోని రాజరాజేశ్వరీనగర్‌లో ఉన్న సిల్వర్‌కీ లాడ్జ్ జూదానికి కేంద్రంగా మారింది. ఓ వైపు ఆన్‌లైన్ క్రికెట్ బెట్టింగ్ మరో వైపు పేకాట నిర్వహిస్తున్నారు. గుట్టు చప్పుడు కాకుండా నిర్వహిస్తున్న ఆన్‌లైన్ క్రికెట్ బెట్టింగ్‌ను మాదాపూర్ ఎస్‌ఓటీ పోలీసులు ఛేదించారు. కొండాపూర్‌లోని రాజరాజేశ్వరీనగర్‌లోని సిల్వర్‌కీ ఓయో లాడ్జ్‌లో క్రికెట్ బెట్టింగ్ నిర్వహిస్తున్నట్లు సమాచారం అందడంతో ఎస్‌ఓటీ, గచ్చిబౌలి పోలీసులు దాడి చేశారు. లాడ్జ్‌లోని 401 రూమ్‌లో బీఎస్‌ఎఫ్‌ఎల్ 666 బెట్టింగ్ యాప్ ద్వారా ఆన్‌లైన్ క్రికెట్ బెట్టింగ్ నిర్వహిస్తున్నారు. సబ్ బుకీ మాడపాటి బస్వరాజ్(26), పంటర్లు కొండాపూర్‌కు చెందిన అమన్‌చౌదరీ(23), నేలం రవి(31)తెల్లాపూర్‌కు చెందిన మణికాంత్‌రెడ్డి(20)లను అదుపులోకి తీసుకున్నారు. ప్రధాన బుకీలు హఫీజ్‌పేట్‌కు చెందిన జీతుశర్మ, మాడిశెట్టి అజయ్ పరారీలో ఉన్నారు. ముగ్గురు పంటర్లను అదుపులోకి తీసుకొని కరూర్ వైశ్య బ్యాంక్, కోటక్ మహేంద్ర బ్యాంక్, యాక్సిస్ బ్యాంక్‌లలో రూ.1,84,398 సీజ్ చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ముగ్గురు పేకాటరాయుళ్లు అరెస్ట్
రూ.1.52 లక్షల నగదు స్వాధీనం



పేకాట ఆడుతూ పట్టుబడ్డ శ్రీకాంత్, కిరణ్, ప్రశాంత్ రెడ్డి తదితరులు

సిల్వర్ కీ ఓయో లాడ్జ్‌లో పేకాట ఆడుతున్న ముగ్గురిని అరెస్ట్ చేసినట్లు గచ్చిబౌలి సీఐ ఆంజనేయులు తెలిపారు. పేకాట ఆడుతున్నట్లు సమాచారం అందడంతో మాదాపూర్ ఎస్‌ఓటీ, గచ్చిబౌలి పోలీసులు దాడి చేశారు. మసీద్‌బండకు చెందిన ఎం.శ్రీకాంత్(27), కొండాపూర్ ప్రశాంత్‌నగర్‌కు చెందిన ఎన్.కిరణ్ (30), గచ్చిబౌలి ఇందిరానగర్‌కు చెందిన ఎన్.ప్రశాంత్ రెడ్డి(28) పేకాటఆడుతూ రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడ్డారు. ప్రేమ్‌నగర్‌కు చెందిన ఆర్గనైజర్ ఎం.బస్వరాజ్(26) పరారీలో ఉన్నాడు. నిందితుల నుంచి ఏడు సెట్ల ప్లేయింగ్ కార్డ్స్, రూ.1.52 లక్షల నగదు స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.